క్లుప్తంగా

రెండు ద్విచక్రవాహనాలు ఢీ

– ముగ్గురికి గాయాలు

మదనపల్లె : రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన ఆదివారం మదనపల్లెలో జరిగింది. వాయల్పాడు మండలం చింతపర్తికి చెందిన వెంకటరమణ కుమారుడు శివప్రసాద్(20), భాస్కర్ కుమారుడు చందు(19)లు బైక్‌లో మదనపల్లెకు బయలుదేరారు. అదే గ్రామానికి చెందిన వెంకటరమణ, భార్య భవానిలు ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వచ్చి స్వగ్రామానికి వెళుతుండగా రెండు వాహనాలు సీటీఎం పంచాయతీ పూలవాండ్లపల్లె క్రాస్ వద్ద ఢీకొన్నాయి. ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే బాధితులను 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అత్యవసర విభాగం వైద్యులు చికిత్సలు అందించారు. గాయపడిన వారిలో శివప్రసాద్ పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం



భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్ భీమేశ్వర్‌రావు

పీలేరు : భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తహసీల్దార్ ఎం. భీమేశ్వర్‌రావు అన్నారు. గత నెల రెవెన్యూ సదస్సులో దొడ్డిపల్లె గ్రామానికి చెందిన ఆనందస్వామి దొడ్డిపల్లెలో సర్వే నెంబరు 23/1, 11/2లో పట్టాభూమి ఆరు ఎకరాలు అన్యాక్రాంతమైందని అర్జీ ఇచ్చారు. అందులో భాగంగా ఆదివారం సంబంధిత రికార్డులను పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో భూమిని సర్వే చేపట్టారు. కార్యక్రమంలో వీఆర్వో యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో ప్రతిభ

పీలేరు : మదనపల్లె యోధా మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో అకాడమీ వ్యవస్థాపకులు సతీష్ యోధా ఆధ్వర్యంలో నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో పీలేరు యోధా స్టూడెంట్స్ ప్రతిభ చూపినట్లు కరాటే మాస్టర్ ఇనాముల్ హక్ తెలిపారు. బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో పీలేరుకు చెందిన గీతశ్రీ పర్పుల్, శవన్, వెనుహ్యా, సుజల, అర్ అలి, పార్థవ్ ఎల్లోబెల్ట్, వికాస్ బ్రౌన్ బెల్ట్ సాధించినట్లు తెలిపారు. కరాటేలో ఒక్కొక్క బెల్ట్ ఒక్కొక్క స్థాయిని తెలుపుతుందని చెప్పారు. బెల్ట్ పెరిగేకొద్ది శిక్షణ కఠినంగా ఉంటుందని తెలిపారు.

ఎస్ఎస్ అసోసియేట్స్ సేవలను వినియోగించుకోవాలి



ఎస్ఎస్ అసోసియేట్స్‌ను ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్

మదనపల్లె : అకౌంటెన్సీ, ట్యాక్స్ పేయర్స్ కోసం ఏర్పాటైన ఎస్ఎస్ అసోసియేట్స్(ట్యాక్స్ కన్సల్టెన్సీ) సేవలను పట్టణ ప్రజలు వినియోగించుకోవాలని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని రీడింగ్‌రూమ్ స్ట్రీట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ఎస్ అసోసియేట్స్ కార్యాలయాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఆర్థిక వ్యవహారాల్లో పారదర్శకత ముఖ్యమని, వ్యాపార, ఉద్యోగ వ్యవహారాల్లో ఆర్థిక లావాదేవీలకు సంబంధించి నమ్మకమైన ట్యాక్స్ కన్సల్టెన్సీని ఆశ్రయిస్తే ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిశ్చింతగా ఉండవచ్చన్నారు. ఎస్ఎస్ అసోసియేట్స్ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే సంస్థగా పట్టణ ప్రజల ఆదరాభిమానాలు పొందాలని ఆకాంక్షించారు. ట్యాక్స్ కన్సల్టెన్సీ ఆడిటర్ శిరీషను అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్.ఏ.కరీముల్లా, అనంతమునిశేఖర్, కౌన్సిలర్ ఈశ్వర్‌నాయక్, మహమ్మద్ యూనిస్, కొత్తపల్లె మహేష్, ఎన్. నవాజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణదేవరాయుల జయంతి



శ్రీకృష్ణదేవరాయుల చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

బి.కొత్తకోట: విజయనగర సామ్రాజ్య పాలకుడు శ్రీకృష్ణదేవరాయుల జయంతిని ఆదివారం బి.కొత్తకోటలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మిఠాయి పంచిపెట్టారు. ఈ సందర్భంగా కాపు నాయకులు మాట్లాడుతూ కరువుసీమ రాయలసీమను సస్యశ్యామలం చేసి కన్నీళ్లు తుడిచి అన్నపూర్ణగా మార్చిన ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయులని కొనియాడారు. కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కాపునేతలు పాల్గొన్నారు.

అంతర్ పంటల సాగుతో ఆదాయం

- టమాటాలో అంతర్ పంటలుగా బీన్స్, చిక్కుళ్లు, కాకర
- నష్టాల నుంచి బయటపడుతున్న రైతులు
- ఏక కాలంలో రెండు పంటలు సాగు



టమాటాలో అంతర్ పంటగా సాగు చేసిన చిక్కుడు



అంతర్ పంటగా సాగు చేసిన బీన్స్

గుర్రంకొండ: అంతర పంటల సాగుతో రైతులకు మంచి లాభాలు వస్తున్నాయి. ముఖ్యంగా పడమటి మండలాల్లో రైతులు అంతర్ పంటల సాగుపై దృష్టి సారిస్తూ నష్టాలను అధిగమిస్తున్నారు. టామాటా పంట సాగులో బీన్స్, చిక్కుళ్లు, కాకరలను అంతర్ పంటలుగా సాగు చేస్తున్నారు. దీంతో ఏకకాలంలో రెండు పంటలను సాగు చేస్తూ తద్వారా పంటసాగు ఖర్చు ఆదా చేసుకొంటున్నారు. ఒక పంట నష్టపోయిన మరో పంటటైనా చేతికొస్తుండడంతో రైతులు ఈ విధానంతో లాభాల బాట పడుతున్నారు.

బీన్స్ సాగు

ఎకరం పొలం దుక్కుల దగ్గర నుంచి కాయలు కాసే వరకు మొత్తం ఖర్చు రూ. 25 వేల లోపే ఖర్చు వస్తుంది. విత్తనాలు నాటిన 40 రోజులుకు బీన్స్‌కాయల దిగుబడి ప్రారంభమవుతుంది. కేవలం రెండు కోతలకే పంట మొత్తం ఖాళీ కావడం ఈ పంట ప్రత్యేకత. వరి పంటలాగా ప్రతి రోజు నీరు కట్టాల్సిన అవసరం లేదు. ఐదు రోజుల కొకమారు నీరుపెట్టినా సరిపోతుంది.ఎకరానికి నాలుగు టన్నులు నుంచి ఐదు టన్నుల కాయలు దిగుబడి వస్తుంది. ప్రస్తుతం మార్కెట్లో కిలో బీన్స్ ధర రూ.40 పలుకుతోంది. ఈలెక్కన ఎకరానికి రూ. 1.60 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఆదాయం. పంట ఖర్చుపోను రూ.75 లక్షల వరకు లాభం పొదవచ్చు.

చిక్కుడు సాగు

ఎకరం చిక్కుడు సాగు కోసం దుక్కులు దగ్గర నుంచి కాయలు కోత పడే వరకు రూ. 30 వేలు నుంచి రూ.40 వేలు వరకు ఖర్చు వస్తుంది. చిక్కుడు పంట దిగుబడి మొత్తం 20రోజులు లోపే పూర్తి అవుతుంది. పంటకాలం మొత్తం మూడుకోతలతో ముగియడం ఈ పంట ప్రత్యేకత. అయితే పంట కాలం ముసిగిన తరువాత మళ్లీ దుక్కులు, ఎరువులు వినియోగిస్తే తిరిగి 20 రోజుల్లోపే రెండవ దశ కాయలు కాయడం దీని ప్రత్యేకత. ఒక ఎకరానికి 20 నుంచి 30 క్వింటాళ్ల పంట దిగుబడి ఉంటుంది. ప్రస్తుతరం మార్కెట్లో కిలో చిక్కుళ్లు రూ. 60 నుంచి రూ.70 వరకు ధరలు పలుకుతున్నాయి. ఈలెక్కన ఎకరానికి రూ.1.20లక్షల నుంచి రూ.1.80 లక్షల వరకు ఆదాయం వస్తుంది. పంట సాగు ఖర్చు పోను ఎకరానికి రూ. లక్షకు పైగా ఆదాయం సమకూరుతుంది.

కాకర సాగు

ఎకరం కాకర సాగుకు దుక్కుల దగ్గర నుంచి కాయలు కోతకు వచ్చేంత వరకు రూ.40 వేలు ఖర్చు వస్తుంది. చెట్టు ఎదుగుదలకు, పూతపిందె నిలవడానికి గానూ పదిరోజుల కొక మారు మందులు స్ప్రే చేయాల్సి ఉంటుంది. మొక్కలు నాటిన 45 నుంచి 50 రోజులకు కాయలు కాయడం మొదలవుతుంది. సుమారు 45రోజుల పాటు కాయల కోత ఉంటుంది. ఇతర పంటలతో పోల్చితే 3 నెల లోపే పంట కాలం మొత్తం పూర్తి కావడం కాకర ప్రత్యేకత. ఎకరానికి 6 నుంచి 7టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ప్రస్తుతం మార్కెట్లో కిలో కాకర రూ.35 నుంచి రూ.40 వరకు ధరలు పలుకుతున్నాయి. ఈలెక్కన ఎకరానికి రూ.2.45లక్షలు నుంచి రూ. 2.80 లక్షల వరకు ఆదాయం వస్తుంది. పంట సాగుఖర్చు పోను రూ.2.40లక్షల వరకు ఆదాయం వస్తుంది.

పంటల సాగు విధానం

టామాటా పంటలో అంతర్ పంటలుగా బీన్స్, చిక్కుళ్లు, కాకర పంటలను కొత్తగా సాగు చేస్తున్నారు. టామటా ధరల నిలకడపైన అంతరల పంటలు సాగు ఆధారపడి ఉంటుంది. మార్కెట్లో టమాటా ధరలు బాగుంటే రైతులు వీటి జోలికిపోరు. అదే సమయంలో మార్కెట్లో టమటా ధరలు తగ్గుముఖం పడితే సగం కోతలు అయిపోయిన తరువాత టమటా మొక్కల వద్దనే బీన్స్, చిక్కుళ్లు , కాకర విత్తనాలు నాటేస్తారు. టమాటా పంటకు సరిపోయే నీటితోనే ఈ రెండు పంటలు చేతికి రావడం గమనార్హాం.

అదనపు ఖర్చు ఉండదు

అంతర పంటల సాగుకు అదనపు ఖర్చు ఉండదు. టమాటా పంట సాగు కోసం పొలం ఏర్పాటు చేసిన డ్రిప్ పరికరాలు, ల్యాడర్లే వీటికి సరిపోతాయి. మళ్లీ ప్రత్యేకంగా వీటి సాగు కోసం పొలాలు దుక్కులు చేయాల్సిన అవసరం లేదు. టమాటా పంట సాగు కాలం ముగిసే వరకు వాటికి ఉపయోగించే ఎరువులు, పురుగు మందులే వీటికి సరిపోతుంటాయి. టమాటా పంట సాగు కోసం ఏర్పాటు చేసిన సీడ్ కట్టెలే వీటి ఎదుగుదలకు పనికొస్తాయి.

మార్కెటింగ్

బీన్స్, చిక్కుళ్లు, కాకర పంటలకు మార్కెటింగ్ సౌకర్యం బాగుంటుంది. తిరుపతి, కడప, తమిళనాడులోని చెన్నై, బెంగుళూరు వంటి పట్టణాల్లో మార్కెటింగ్ బాగుంటుంది. ప్రత్యేకంగా తయారు చేసిన 50 కేజీల సంచుల్లో వీటిని ప్యాక్ చేసి వాహనాల్లో తరలిస్తుంటారు.

రెండు పంటలు సాగు చేస్తాను



ప్రతి ఏడు టమాటా పంటలోనే రెండు పంటలను సాగు చేస్తుంటాను. టమాటాలో అంతర్ పంటలుగా బీన్స్, కాకర, చిక్కుళ్లు సాగు చేస్తుంటాను. మార్కెట్లో టమాటా ధరలు పడిపోతున్నాయనే సంకేతాలు వస్తున్నాయంటే అంతర్ పంటలను వెంటనే సాగు చేస్తాను. పంట ఖర్చు సాగు తగ్గిపోయి పెట్టుబడి కలిసివస్తుంది.

– వెంకటరమణ, రైతు, మొరంపల్లె

దిగుబడితో పాటు ఆదాయం



అంతర్ పంటలు సాగు చేయడం వలన రైతులకు దిగుబడితో పాటు ఆదాయం ఉంటుంది. కేవ లం టమాటానే నమ్ముకొంటే ఒక్కోసారి గిట్టుబాటు ధరలు లభించవు. అంతర్ పంటలుగా బీన్స్, చిక్కుడు, కాకర వంటి పంటలను సాగు చేసుకొంటే టమాటా సాగులో వచ్చిన నష్టాన్ని భర్తీ చేసుకొనే అవకాశముంటుంది.

– రత్నమ్మ, వ్యవసాయాధికారి గుర్రంకొండ

రెడ్డెమ్మతల్లి ఆలయానికి కైంకర్య పాత్రలు, రూ.50 వేల విరాళం



కైంకర్య పాత్రలతో పాటు రూ.50 వేలను ఈఓకు అందజేస్తున్న దాత ప్రకాష్‌బాబు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయానికి కైంకర్య పాత్రలతో పాటు రూ.50 వేలను భక్తులు విరాళంగా అందించారు. ఆదివారం చెన్నైకు చెందిన ప్రకాష్‌బాబు కుటుంబ సమేతంగా అమ్మవారి ఆలయానికి విచ్చేశారు. స్థానిక ఆలయ ఈఓ కార్యాలయానికి చేరుకొని రూ. 50 వేల తోపాటు అమ్మవారి కైంకర్యాలకు వినియోగించే ఐదు కలశ చెంబులను ఈఓ మంజులకు అందజేశారు. ఈసందర్భంగా ఆలయ మర్యాదలతో దాతలకు ఆలయ అధికారులకు స్వాగతం పలికి అమ్మవారికి ప్రత్యేకమైన పూజలు చేయించారు. అమ్మవారిశేష వస్త్రంతో దాతలను అధికారులు ఘనంగా సన్మానించి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

పర్యాటకుల సందడి

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులు ప్రకృతి అందాలను తిలకిస్తూ చల్లటి వాతావరణాన్ని ఆస్వాదించారు. గాలిబండ, వ్యూపాయింట్లు, అటవీ సముదాయంలో ప్రకృతి విశేషాలు, అటవీ ప్రాంతాన్ని తిలకించారు. ప్రకృతి అధ్యయన కేంద్రంలో అటవీ విశేషాలను వీక్షించారు. పిల్లలు పార్కుల్లో ఆడుకొంటూ సందడిగా గడిపారు.

నూతన వధూవరులకు మాజీ మంత్రి ఆశీర్వాదం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి. ఎంపీ మిథున్‌రెడ్డి

పీలేరు రూరల్ : మండలంలోని తలపుల ఎంపీటీసీ సభ్యుడు జ్యోతుల వెంకటరమణనాయుడు కుమారుడు జె. మహేష్‌కు చిత్తూరు జిల్లా ఐరాల మండలంకు చెందిన పి. మహేష్ కుమార్తె బానుతో స్థానిక ఎంఎం ఫంక్షన్ హాల్‌లో వివాహం జరిగింది. ఆదివారం రాత్రి మాజీ మంత్రి, పుంగనూరు శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చింతల రామచంద్రారెడ్డి, జి.వి. శ్రీనాథరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎంపీపీ సతీష్‌రెడ్డి, సర్పంచ్‌లు హబీబ్‌బాషా, దండు జగన్ మోహన్‌రెడ్డి, నాయకులు మల్లికార్జునరెడ్డి, చక్రపాణి రెడ్డి, మస్తాన్, కేశవరెడ్డి, సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి



వెల్‌విషర్ సంస్థ వ్యవస్థాపకులు గిరీష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

మదనపల్లె సిటీ: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గతివిధి సంయోజక్ రాష్ట్ర ప్రతినిధి ఆదిశేషయ్య అన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో సమావేశం జరిగింది. ప్రతి మనిషి మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ కవర్లను వాడొద్దని, వాటికి ప్రత్యామ్నాయంగా గుడ్డసంచులను ఉపయోగించాలన్నారు. నీటిని వృథా చేయకుండా, నీరు కాలుష్యం కాకుండా కాపాడాలన్నారు. పర్యావరణ కోసం పని చేస్తున్న వెల్‌విషర్ సంస్థ వ్యవస్థాపకులు గిరీష్‌ను సన్మానించారు. అనంతరం సొసైటీ కాలనీలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో గతివిధి జిల్లా అధ్యక్షులు సిద్దారెడ్డి, ఏపియుఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, ఏబీవీపీ జిల్లా ప్రముక్ ఆంజనేయరెడ్డి, గోపాలకృష్ణారెడ్డి, జనార్ధన్, హరినాథ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా దోపు తిరునాల



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



పరుషకు వచ్చిన ఎద్దులు

మదనపల్లె సిటీ: మదనపల్లె రూరల్ మండలం సీటీఎం నలవీరగంగాభవానీ జాతర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దోపు తిరునాల ఘనంగా జరిగింది. అమ్మవారిని ముత్యాల అలంకరణలో అలంకరించారు. ఆదివారం కావడంతో భక్తులు పోటెత్తారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ట్రాక్టర్లను ప్రత్యేకంగా అలంకరించి అన్నదానాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. మహిళలు దీలు, బోనాలతో మంగళవాయిద్యాలతో ఆలయం వద్దకు చేరుకుని పూజలు చేశారు. భక్తుల కోసం ప్రత్యేక క్యూ ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు అమ్మవారి ఆలయ ధ్వజస్తంభం ఎదుట నిమ్మకాయలతో దీపాలు వెలిగించి, టెంకాయ,కర్పూరం వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. తాలూకా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు పలువురు తాగునీరు, మజ్జిగ అందజేశారు.

ఎద్దుల పరుష ప్రారంభం

జాతర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఎద్దుల పరుష ప్రారంభమైంది. ఆలయ సమీపంలోని మైదానంలో సర్పంచు ఆనందపార్థసారథి, వెలుగు చంద్ర పరుషను ప్రారంభించారు. పరుషకు మదనపల్లె, వాల్మీకిపురం, తంబళ్లపల్లె, పీలేరు, కురబలకోట ప్రాంతాల నుంచి రైతులు పెద్ద ఎత్తున ఎద్దులను కొనుగోలు చేయడానికి వచ్చారు.

ఎద్దులపై తరగని మమకారం :

కాలం మారుతున్న ఎద్దులపై రైతులకు మమకారం పోలేదు. సీటీఎం ఎద్దుల పరుషలో నాటి రకం ఎద్దులు రూ.లక్షలు పలికాయి. పలువురు రైతులు పోటీలు పడి కొనుగోలు చేశారు. వ్యవసాయంలో ఎద్దుల పాత్ర కీలకం. ఇలాంటి సమయంలో రైతులు లక్షలు పెట్టి వాటిని కొనుగోలు చేశారు. మదనపల్లె మండలం మిట్టపల్లెకు చెందిన రైతు రమణారెడ్డి రూ.1.40 లక్షలు ఇచ్చి ఎద్దులను కొనుగోలు చేశారు. ఇలా రూ.లక్ష, రూ.80, .రూ.75 వరకు ధరలు పలికాయి. ఎద్దుల పరుషకు కావాల్సిన నీరు, ఇతర సౌకర్యాలు వెలుగు చంద్ర ఏర్పాటు చేశారు. ఈ ఎద్దుల పరుష ఈనెల 20 వరకు జరుగుతుందని నిర్వాహకులు ఆనందపార్థసారథి, సురేంద్రరెడ్డి, పొగాకు వీరప్రతాప్, రెడ్డిరాం ప్రసాద్ తెలిపారు.

డిజిటల్ ఎవిడెన్స్ వర్క్‌షాప్

పీలేరు రూరల్ : విజయవాడలో డైరెక్టరేట్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన డిజిటల్ ఎవిడెన్స్ వర్క్‌షాప్‌లో పీలేరు ఏపీపీ శారద పాల్గొన్నారు. డిజిటల్ సాక్ష్యాల వ్యవహారంలో ప్రాసిక్యూటర్లు ఎదుర్కొంటున్న సవాళ్లు, పరిష్కారాలు అనే అంశంపై రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో ఏపీపీ శారద పాల్గొని తన అనుభవాలు, సాంకేతిక పరిజ్ఞానం గురించి వివరించారు. అనంతరం డైరెక్టరేట్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ డైరెక్టర్ బైరా రామకోటేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఆకే రవికృష్ణ చేతుల మీదుగా ధృవీకరణ పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి ఆధునిక కాలంలో నేర పరిశోధనలో డిజిటల్ సాక్ష్యాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని, న్యాయస్థానాల్లో వీటిని సమర్థవంతంగా వినియోగించడం ప్రధాన సవాలుగా మారిందని తెలిపారు.

గంగమ్మ తల్లికి బోనాల సమర్పణ

కురబలకోట: మండలంలోని తెట్టు పాలేటి గంగమ్మకు మండ్యంవారిపల్లె గ్రామస్థులు ఆదివారం దీలు, బోనాలలు సమర్పించారు. నూతనంగా నిర్మిస్తున్న లక్ష్మీ నరసింహ స్వామి, రేణుక ఎల్లమ్మ ఆలయ శిఖర విగ్రహ ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా గ్రామస్థులు భక్తి శ్రద్ధలతో కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈనెల 19 నుంచి 21 తేదీలలో నూతన ఆలయ ప్రతిష్ట చేపట్టనున్నట్లు ఆలయ ధర్మకర్త పూజారి ఆంజి తెలిపారు.

ఒత్తిడికి దూరంగా ఉండాలి

మదనపల్లె సిటీ: విద్యార్థులు ఒత్తిడికి దూరంగా ఉండాలని, ప్రస్తుత అవసరాలకు తగ్గట్టు ఎంతో ధైర్యంగా ఉండాలని ప్రముఖ ట్రైనర్, లీగల్ కౌన్సిలర్ జి.వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీలో హౌటు అచ్యువ్ హ్యాపీనెస్, హెల్తీనెస్, పీస్‌ఫుల్‌నెస్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంతోషంగా ఉండటానికి ఒక ప్రణాళిక ప్రకారం చదుకోవాలన్నారు. అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలన్నారు. అలాగే ఆరోగ్య పట్ల కూడా శ్రద్ద తీసుకోవాలన్నారు. విద్యార్థులు మానసిక ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో తెలియజేశారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి, ప్రెసిడెంట్ నాగమల్లారెడ్డి, డీన్ భాస్కర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ



అమ్మవారి ఎదుట వరపడిన మహిళలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. రెడ్డెమ్మతల్లీ చల్లంగా చూడమ్మా అంటూ భక్తులు అమ్మవారికి మొక్కుకొన్నారు. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి వేకువజామునే నైవేద్యాలు సమర్పించి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. మహిళలు అమ్మవారి ఎదుట సంతాన కోసం వరపడ్డారు. భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. మరికొందరు భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు. ఆలయంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

రామసముద్రం : మండలంలోని చెంబకూరు జెడ్పీ హైస్కూల్ 2004–05 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులంతా ఒకచోట కలుసుకుని ఒకరికొకరు ఆత్మీయంగా పలుకరించుకుని తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. రాబోయే రోజుల్లో ఒకరికొకరు అండగా ఉండాలని తీర్మానం చేసుకున్నారు. అనంతరం పిల్లా, పాపలతో కలిసి పాఠశాల ఆవరణలో ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు పూర్వ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొని ఉపాధ్యాయులను దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం శంకరప్ప, ఉపాధ్యాయులు జయచంద్రారెడ్డి, అనంతవేణుగోపాలచారి, చంద్రశేఖర్‌నాయుడు, బాలసుబ్రహ్మణ్యం, చిన్నప్ప, హరినాథ్, మాధవి, హంసవేణి, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అందుబాటులో ఉంటా



జర్రావారిపల్లెలో మాజీ ఎమ్మెల్యే చింతలను సత్కరిస్తున్న నాయకులు

కలికిరి : వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉంటానని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం గుర్రంకొండ మండలం మర్రిపాడు పంచాయతీ యల్లారెడ్డిగారిపల్లెలో పార్టీ నాయకుడు విఠలం గంగిరెడ్డి నూతన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే కలికిరి పట్టణం సాయిబాలాజీ నగర్‌లో రాచపల్లె రవీంద్రనాథరెడ్డి నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వాల్మీకిపురంలో వైఎస్సార్‌సీపీ క్యాంప్ కార్యాలయంలో చింతల మధుసూదన్‌రెడ్డి కుమార్తె భావన నిశ్చితార్థంలో పాల్గొన్నారు. అనంతరం జర్రావారిపల్లె పంచాయతీ వడ్డిపల్లె మాజీ సర్పంచ్ ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే తోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పీలేరు రూరల్ : స్థానిక నెహ్రూబజార్‌లోని జెడ్పీ మెయిన్ ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ తిరుపతి వారిచే నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఆదివారం నిర్వహించిన వైద్యశిబిరంలో 153 మందికి కంటి పరీక్షలు, 22 మందికి స్త్రీల గర్భకోశ వ్యాధుల పరీక్షలు, 49 మందికి జనరల్ వైద్య సేవలు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. మొత్తం 224 మంది వైద్య పరీక్షలకు హాజరు కాగా 23 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపికచేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్‌ప్రెసిడెంట్ సోమురవికుమార్, తిరుపతి అరవింద కంటి ఆస్పత్రి సిబ్బంది క్యాంప్ మేనేజర్ గౌరీశంకర్, గైనకాలజిస్ట్ డాక్టర్ ఆయేషా ఖాతూన్, డాక్టర్ భారతి, చీఫ్‌నర్స్ లీలావతి, న్యాయవాది మహమ్మద్ అలీ, హెచ్ఎం సురేంద్రనాథరెడ్డి, ఎన్‌సీసీ అధికారి జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్చి 23న తిరుపతిలో మాలల సింహగర్జన


- ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా సభ
- కరపత్రాలు ఆవిష్కరించిన మాలల జేఏసీ నాయకులు



మాలల సింహగర్జన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాలల జేఏసీ నాయకులు

మదనపల్లె : ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్‌ను వ్యతిరేకిస్తూ మార్చి 23న తిరుపతిలోని నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్స్‌లో మాలల సింహగర్జన నిర్వహిస్తున్నట్లు రాయలసీమ మాలల జేఏసీ అధ్యక్షులు యమలా సుదర్శనం తెలిపారు. ఆదివారం స్థానిక మాలమహానాడు కార్యాలయంలో రాయలసీమ మాలల సింహగర్జనకు సంబంధించి కరపత్రాలు, వాల్‌పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యమలా సుదర్శనం మాట్లాడుతూ...భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 341కి విరుద్ధంగా 2024 ఆగస్ట్ 1వ తేదీన సుప్రీంకోర్టు జస్టిస్.చంద్రచూడ్ 7మంది న్యాయమూర్తులతో ఇచ్చిన తీర్పు రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. 2004లో ఇ.వి.చెన్నయ్య వర్సెస్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ కేసులో రాజ్యాంగ మూలాల్లోకి వెళ్లి ఎస్సీ వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకు లేదని, చేయాలంటే పార్లమెంట్‌లో 341 అధికరణను సవరించాలని సుప్రీంకోర్టు 5 మంది న్యాయమూర్తులతో కలిసి తీర్పునిచ్చిందన్నారు. దీనిపై మందకృష్ణ ఎలాంటి అప్పీలు చేయకుండా 2023లో ప్రధాని మోదీ సలహాతో పంజాబ్ కేసులో ఇంప్లీడ్ అయ్యారన్నారు. మనువాదుల ప్రేరణతో మందకృష్ణ ఆర్ఎస్ఎస్ ఏజెంటుగా మాలలపై విషం చిమ్ముతున్నారన్నారు. ప్రజాస్వామ్యవాదులుగా వర్గీకరణ వాదాన్ని నిలువరిస్తున్నారన్నారు. వర్గీకరణకు ప్రధాన వ్యతిరేకి మందకృష్ణనే అని అన్నారు. వర్గీకరణను వ్యతిరేకిస్తూ తెలంగాణలో వివేక్, ఆంధ్రలో దేవిప్రసాద్ నాయకత్వంలో లక్షల మందితో సింహగర్జనలు జరిగాయన్నారు. మాలలపై అటు కేంద్ర, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు కత్తి కట్టాయన్నారు. ఇలాంటి సమయంలో మాలల సంఘటిత శక్తిని చాటాల్సిన అవసరం ఉందన్నారు. మాలలు ప్రజాస్వామ్యవాదులు, అంబేద్కర్ వారసులని తెలిపేందుకు మార్చి 23న తిరుపతి పట్టణంలోని నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్‌లో జరపనున్న మాలల సింహ గర్జనకు ప్రజాస్వామ్యవాదులు హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ ఉపాధ్యక్షులు గుండామనోహర్, ప్రచార కార్యదర్శి యమలాచంద్రయ్య, రామచంద్ర, ప్రశాంత్, అప్పయ్య, గంగరాజు, ఎల్రక్షిషియన్ మోహన్, వడిగలశేఖర్‌బాబు పాల్గొన్నారు.

యాసిడ్ దాడి బాధితురాలికి పరామర్శ



గౌతమిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

మదనపల్లె : ప్రేమోన్మాది యాసిడ్ దాడి ఘటనలో బాధితురాలు గౌతమి బెంగళూరు వైదేహి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఆదివారం బెంగళూరులోని వైదేహి ఆస్పత్రికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా వెళ్లి బాధితురాలి ఆరోగ్యపరిస్థితిపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. గౌతమితో మాట్లాడి భయపడాల్సిన పనిలేదని, వైద్యఖర్చులన్నీ ప్రభుత్వమే భరిస్తుందని మంత్రి నారాలోకేష్ హామీ ఇచ్చారన్నారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ జరిగిన ఘటన దురదృష్టకరమన్నారు. నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారని, కఠినంగా శిక్షించేలా జిల్లా ఎస్పీ అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా బాధితురాలి కుటుంబసభ్యులు మాట్లాడుతూ కష్టకాలంలో తమకు అండగా నిలవాలని, ప్రభుత్వం తరపున జీవనోపాధి చూపించాల్సిందిగా కోరారు.